# స్పెయిన్, పోర్చుగల్ ట్రావెలాగ్



## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

*16-9-2015*

ఉదయం ఆరుకి అలారం మోగగానే లేచాం. తయారై ఎనిమిదికి బ్రేక్‌ఫాస్ట్ సర్వ్ చేసే రెస్టారెంట్‌కి వెళ్ళాం. బ్రెడ్‌ని టోస్ట్ చేసుకుని ఫిగ్ జామ్ రాసుకుని తిన్నాం. నేను టీ తాగాను. పద్మజ ఆరెంజ్ జ్యూస్ తాగింది.

మేము లిఫ్ట్‌లో మళ్ళీ మా గదికి వెళ్ళి మా సామానుతో లాబీలోకి వచ్చాం. ఉదయం తొమ్మిదికి అంతా సామానుతో కోచ్ ఎక్కాం. బస్ బయలుదేరేముందు దీపక్ ఎప్పటిలా అందర్నీ లెక్కపెట్టాక అడిగాడు.

"అన్నీ మర్చిపోకుండా తీసుకున్నారా? కొంతదూరం వెళ్ళాక గుర్తొస్తే మళ్ళీ వెనక్కిరాం. మీ పాస్‌పోర్ట్, మొబైల్, వాచ్, ఉంగరం, షేవింగ్ సెట్, కళ్ళజోడు, కట్టుడు పళ్ళు.. బెటర్ హాఫ్."

"నేను మర్చిపోదామనుకున్నా మా ఆవిడ వెంటపడింది" దేశాయ్ నవ్వుతూ చెప్పాడు.

"భార్యాభర్తల మధ్య ఇలాంటి హాస్యాన్ని అంతా ఎంజాయ్ చేస్తారు. విడాకులకి వచ్చినప్పుడే ఇవి జోక్స్ అవవు" జయదేవ్ గొణిగాడు.

"ఆలివ్ ఆయిల్ కొనాలి. వీలుంటే ఎక్కడైనా ఆపుతారా?" పాటిల్ అడిగాడు.

"ఇంకా కొనలేదా? సూపర్ మార్కెట్లలో చాలా వెరైటీస్ ఉన్నాయి. మేం కొన్నాం" రమేష్ చెప్పాడు.

"ఇటలీ, స్పెయిన్‌లు ఆలివ్ ఆయిల్‌కి, వైన్స్‌కి ప్రసిద్ధి. మీ ఫ్రెండ్స్‌కి బహుమతిగా వీటిని తప్పక తీసుకెళ్ళండి" దీపక్ చెప్పాడు.

బస్ బయలుదేరగానే దీపక్ ఎప్పటిలానే గాయత్రీ మంత్రం ఉచ్ఛరించాడు.

"మన తర్వాతి స్టాప్ ఈస్టర్న్ మెడిటరేనియన్ కోస్ట్ ఐన వేలెన్షియా. అది గ్రెనడా నించి నాలుగు వందల తొంభై కిలోమీటర్ల దూరంలో ఉంది. ఐదు గంటల ప్రయాణం. మేడ్రిడ్, బార్సిలోనా తర్వాత వేలెన్షియా స్పెయిన్‌లోని మూడో పెద్ద నగరం. పర్యాటకులు అధికంగా సందర్శించే ఆ నగరంలో ఈటింగ్, నైట్ లైఫ్‌కి ప్రాముఖ్యత ఉంది. తరచు వరదలు వచ్చే తురియా నదిని ఊరు శివార్లలోకి మళ్ళించి, గతంలో ఆ నది పారిన చోట నగరంలో మలుపులు తిరిగే పార్క్‌ని నిర్మించారు. సిటీలో ఇది ఆకుపచ్చ రిబ్బన్‌లాంటిది. ఇక్కడ అనేక పురాతన, ఆధునిక భవంతులు ఉన్నాయి. ఇక్కడి బీచ్‌కు చాలా ఫేమస్. వీలైతే ఒకటి, రెండు మనం కూడా చూస్తాం. పయయాలాంటి రైస్ డిషెస్ ఇక్కడ ఫేమస్. మిగిలింది గైడ్ చెప్తాడు. ఎంజాయ్ ది వ్యూ" దీపక్ చెప్పాడు.

మూడు గంటల తర్వాత పన్నెండున్నరకి మా కోచ్‌ని దారిలో సెప్సా అనే లా పరాదా అంటే రెస్ట్ స్టాప్‌లో లంచ్ కోసం ఆపారు. అదో చిన్నకొండ వెనక షాపింగ్ కాంప్లెక్స్. అందులో ట్వంటీ ఫోర్ అవర్ కెఫ్టీరియా, సెల్ఫ్ సర్వీస్ పెట్రోల్ బంక్, సావనీర్స్ అమ్మే షాప్, కార్ పార్క్ ఉన్నాయి. అక్కడి హోస్టల్ అనే రెస్టారెంట్‌లో వెజ్ పీజా తిన్నాం. పదమూడు యూరోలు. నేను గార్లిక్ బ్రెడ్ కూడా తిని బ్లాక్ టీ తాగాను. రెస్టారెంట్లో కస్టమర్స్‌ని మాత్రమే రెస్ట్‌రూంని ఉపయోగించుకోవాలి అనే నియమం ఉంది. ఇంకా టైం ఉండటంతో చుట్టుపక్కల రోడ్లమీద నడిచి చూసాం.

నలభై ఐదు నిమిషాల తర్వాత మళ్ళీ బయలుదేరాం. కిటికీలోంచి దారిలో పచ్చటి యూరోపియన్ గ్రామాలు కనిపించాయి. అలాంటి వాటిలో ఓ దాంట్లో రిటైర్‌మెంట్ లైఫ్ గడపాలన్నది నాకున్న కోరిక. కానీ కుదరదు.

వేలన్షియాలోకి ప్రవేశించే మార్గంలో తురియా నది కనిపించింది.

"ఐటనరరీ ప్రకారం ఈ పూట మీ అంతట మీరే చూడాలి. డ్రైవర్‌తో మాట్లాడాను. రేపటి మన టూర్‌లో బీచ్ లేదు. వేలన్షియా బీచ్‌లకి ప్రసిద్ధి. కాబట్టి మనిషికి పది యూరోలు ఇస్తే బీచ్‌కి రెండు గంటలు వెళ్ళిరావచ్చు. రాదలచుకున్నవాళ్ళు చేతులు ఎత్తండి" దీపక్ మైక్‌లో చెప్పాడు.

అంతా చేతులు ఎత్తారు.

"గుడ్ మరో పదినిమిషాల్లో హోటల్‌కి చేరుకుంటాం. చెకిన్ అయ్యాక మీరంతా ఫ్రెష్ అయి సరిగ్గా నాలుగుకి లాబీలోకి రండి. మీ దగ్గర ఇప్పుడే డబ్బు తీసుకుంటాను" అతను చెప్పాడు.

అందరి దగ్గరా డబ్బు కలెక్ట్ చేసి పేర్లు రాసుకున్నాడు.

మధ్యహ్నం మూడుకి హోటల్ ఏసి మేరియట్ హోటల్ ఆవరణలో మా కోచ్ ఆగింది.

యూనిఫాంలోని హోటల్ సిబ్బంది మా సామానుని పెద్ద ట్రాలీలో వేసుకుని లాబీలోకి వెళ్ళారు. ఎప్పటిలానే దీపక్ రిసెప్షన్ నించి మా గది తాళం చెవులు తీసుకుని ఇచ్చేదాకా ఆగాము. మా రూం నంబర్ 510. అంతా సమయానికి లాబీలోకి వచ్చారు. కోచ్‌లో కబానియల్ బీచ్‌కి చేరుకున్నాం.

గతంలో ఇక్కడ చేపలు పట్టేవాళ్ళు నివశించేవారు. అందువల్ల దీన్ని లాస్ అరెనాస్ అని స్థానికులు పిలుస్తారు. ఇక్కడ అదే పేరుగల పాత స్పాని రిసార్ట్ హోటల్‌గా మార్చారు. వేలన్షియన్ చిత్రకారుడు జోక్విన్ సుర్‌రోలా ఈ బీచ్‌కి చెందిన చాలా చిత్రాలు గీసాడు. రోడ్ నించి సముద్రానికి చాలా దూరం ఉంది. మధ్యలో అంతా ఇసక. దాదాపు పదినిమిషాలు ఇసకలో నడిస్తే కానీ సముద్రం దగ్గరకి చేరుకోలేకపోయాం. ఇసకలో నడవడం కష్టం కాబట్టి దారంతా చెక్కలని పరిచారు. చెక్కల అంచులకి నీలంరంగు తడి ఇసక అంటితే కడుక్కోడానికి వీలుగా దారిలో పంపులు కూడా ఉన్నాయి. సముద్రంలో చాలామంది బికినీల్లో ఈత కొడుతున్నారు. వారు దుస్తులు మార్చుకోడానికి ఒడ్డున టెంట్స్ ఉన్నాయి. ఇది సేఫ్ బీచ్. మన గోవా బీచ్ సేఫ్ కాదు. కెరటాలు లోపలకి లాగేస్తాయి.


వేలన్షియన్ బీచ్

ఇక్కడో చిత్రం జరిగింది. పూర్తిగా నగ్నంగా తిరుగుతున్న ఓ మూడేళ్ళ పిల్లవాడిని జయదేవ్ ఫోటోలు తీసాడు. ఆ పిల్లవాడి తల్లి ఎందుకు ఫోటోలు తీస్తున్నావని ఏదో భాషలో అరిచింది. ఆమె చెప్పేది మాకు అర్థంకాలేదు. రెండు నిమిషాల్లో

ఓ పోలీస్ వచ్చాడు. ఆమె చెప్పింది విని జయదేవ్ మొబైల్ తీసుకుని చూసాడు. అతను తెలివైన లాయర్. కాబట్టి వాటిని అప్పటికే డిలీట్ చేసేసాడు. ఆమె చెప్పిన ఫోటోలు అతని మొబైల్లో లేకపోవడంతో పోలీస్ దాన్ని తిరిగి ఇచ్చేసాడు. జయదేవ్ తను లాయర్నని బార్ కౌన్సిల్ ఐడి కార్డ్ని చూపించాడు. పోలీస్ ఆమెతో ఏదో చెప్పి వెళ్ళిపోయాడు.

పాశ్చాత్య దేశాల్లో చిన్న పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. పెద్దల అనుమతి లేకుండా ఫోటోలు తీయడం, ముట్టుకోవడం, ముద్దు పెట్టుకోవడం, పలకరించి మాట్లాడటం చైల్డ్ ఎబ్యూస్ నేరం కిందకి వస్తుంది. దీన్ని వారు పెద్ద నేరంగా పరిగణిస్తారు. మా బృందంలో ఎవరూ ఈతకొట్టడానికి వెళ్ళలేదు. అంతా కేవలం చూసి ఆనందించాం అంతే. బీచ్ నించి వెనక్కి వచ్చే దారిలో తెల్లటి రెక్కలు గల ఏక్టర్ ఆంటోనియో ఫెరాండిస్ విగ్రహం ఓ స్థూపం మీద కనిపించింది. బీచ్ మొదట్లో అనేక రెస్టెరెంట్స్, అకామడేషన్స్ కనిపించాయి. గొడుగులు, డెక్ ఛెయిర్లు అద్దెకి ఇస్తారు. అంగవికలులు నీళ్ళల్లోకి వెళ్ళడానికి ప్రత్యేక సౌకర్యాలు ఉన్నాయి. పిల్లలు వాటర్ గేమ్స్ ఆడేందుకు ఓ భద్రమైన ఛానల్ని సృష్టించారు.



బీచ్లో నిప్పుల కుంపటి మీద మొక్కజొన్న కండెలు కాల్చి అమ్ముతున్నారు. ఒకోటి రెండు యూరోలు. ఒకటి కొనుక్కుని తిన్నాను.

అక్కడ నించి ఇండియన్ రెస్టెరెంట్కి స్వాగత్కి డిన్నర్కి ఏడింటికి చేరుకున్నాం. దాన్నో పంజాబీ నడుపుతున్నాడు. సమోసా, వెజ్ సలాడ్, రైస్, కడి, దాల్ మఖానీ, బైంగన్ కా బర్తా, రసం, నిమ్మకాయ పచ్చడి, గులాబ్ జాం. బఫే డిన్నర్ కాదు. వడ్డించారు. ఒకరు ప్రత్యేకంగా దన్సక్ అనే పార్సీ మటన్ ఐటంని ఆర్డర్ చేసి తిన్నారు. మా ట్రిప్లో మరెక్కడా రసం ఇవ్వలేదు. రసాన్ని చూసి జయదేవ్ చాలా సంతోషించాడు. తమిళనాడు నించి వచ్చిన కుక్ దాన్ని చేసాడు. జయదేవ్ అతనితో తమిళంలో మాట్లాడాడు.

ఎనిమిదిన్నరకి తిరిగి హోటల్కి బయలుదేరాం. దారిలో దీపక్ మర్నాటి ప్రోగ్రాం చెప్పాడు.

"రేపు ఉదయం ఏడుకి వేకప్ కాల్. ఎనిమిదికి బ్రేక్ఫాస్ట్. తొమ్మిదికి రూమ్ చెకౌట్ చేసి సామానుతో రండి. వేలన్షియా సిటీ ఓరియెంటేషన్ టూర్కి వెళ్తాం. తర్వాత సరాసరి బార్సిలోనాకి చేరుకుంటాం. రిపీట్. సామాను గదిలో వదలకండి. తెచ్చి కోచ్లో ఉంచండి. మన టూర్ దాదాపు ముగింపుకి వచ్చింది."

మర్నాడు ఉదయం ఏడుకి అలారం పెట్టుకున్నాం.

17-9-2015

ఉదయం ఏడుకి అలారం ఇద్దర్నీ నిద్రలేపింది. తయారై ఇద్దరం బ్రేక్ఫాస్ట్కి వెళ్ళాం. కాంటినెంటల్ బ్రేక్ఫస్ట్లో మళ్ళీ బ్రెడ్ని టోస్ట్ చేసుకుని బటర్తో తిన్నాం. ఆరెంజ్ జూస్ తాగి ఇద్దరం ఎనిమిదిన్నరకి మా గదికి వెళ్ళి ఖాళీ చేసి సామానుతో లాబీలోకి వచ్చాం. మా స్థానిక గైడ్ పెడ్రోని పరిచయం చేసాడు.


పెడ్రో

"బ్యూనోస్ డియాస్. అంటే స్పెనిష్ భాషలో గుడ్ మార్నింగ్. గుడ్ మ్యాంగ్ ఎవ్విరిబడీ. ఫ్లూయెన్స్ ఇన్ త్రీమంత్స్ డాట్ కాం అనే వెబ్ సైట్లో మూడు నెలల్లో 88 ఉపయోగించే స్పెనిష్ పదాలని నేర్చుకోవచ్చు. ఇంకా అరబిక్, కేంటొనీస్, చైనీస్ (మాండరిన్) చెక్, డచ్, ఫ్రెంచ్, జర్మన్, హిబ్రూ, హంగేరియన్, ఐరిష్ భాషలని కూడా ఆ సైట్లోంచి నేర్చుకోవచ్చు. ఇక విషయానికి వస్తే ఐబీరియన్ పెనున్సులా

తూర్పు తీరంలో గల్ఫ్ ఆఫ్ వేలన్షియా ఒడ్డున వేలన్షియా నగరం ఉంది. దీని విస్తీర్ణం 135 చదరపు కిలోమీటర్లు. జనాభా ఎనిమిది లక్షలు. యూరప్‌లోని ఐదవ బిజీయెస్ట్ ఓడరేవు వేలన్షియా పోర్ట్ ఇక్కడే ఉంది. ఈ పోర్ట్ నించి ఆరెంజ్‌లు, ఫర్నిచర్, సెరామిక్ టైల్స్, బట్టలు. ఇనప ఉత్పత్తులు ఎగుమతి అవుతాయి. మెట్రో, ఎయిర్‌పోర్ట్‌లు ఉన్నాయి. గ్లోబ్‌లైజేషన్ అండ్ వరల్డ్ సిటీ రీసెర్చ్ సిటీరీసెర్చ్ నెట్ వర్క్ వేలన్షియాకి గ్లోబల్ సిటీ రేంక్ ఎగుమతి అవుతాయి. మెట్రో, ఎయిర్‌పోర్ట్‌లు ఉన్నాయి. గ్లోబలైజేషన్ అండ్ వరల్డ్ సిటీ రీసెర్చ్ నెట్‌వర్క్ వేలన్షియాకి గ్లోబల్ సిటీ రేంక్ ఇచ్చింది. దీని చరిత్ర క్లుప్తంగా చెప్తాను. ఇది చాలా పురాతన నగరం. క్రీస్తు పూర్వం 138లో డెసిమస్ జూలియస్ బ్రూటస్ కలైకస్ దీన్ని తురియా నదిలోని చిన్న ద్వీపంలో రోమన్ కాలనీగా ఆరంభించాడు. అప్పటి పేరు వేలన్షియా ఎడిటానోరం. వేలన్షియా అంటే అర్థం బలం లేదా సాహసం. రోమన్ సైనికుల సాహస, బలాల గుర్తుగా ఈ పేరు పెట్టారు. క్రీస్తు శకం 714లో మొరాకోనించి వచ్చిన అరబ్బులు స్పెయిన్‌ని ఆక్రమించినప్పుడు ఇక్కడ కూడా వారి భాష, మతం సంప్రదాయాలని పరిచయం చేసారు. వాళ్ళు దీనికి మెడినా ఎట్ తురబ్ అంటే సిటీ ఆఫ్ జాయ్ అనే పేరు పెట్టారు. ఇది తురియా నది ఒడ్డున ఉండటంతో దీనికి మెడీనా ఎట్ తురబ్ అంటే సిటీ ఆఫ్ సేండ్ అని ఆ పేరు పెట్టారని కొందరు పండితులు భావించారు. 1238లో క్రిష్టియన్ రాజు జేమ్స్ - 1 అరాగన్ దీన్ని వారినించి గెలుచుకున్నాడు 1812లో నెపోలియన్ అన్నయ్య జోసెఫ్ బోనపార్టె రాజధానిని ఇక్కడికి మార్చాడు. దీని సిటీ సెంటర్ చారిత్రాత్మకమైంది. వ్యవసాయం, ఫిషింగ్ ప్రధాన వృత్తులుగా ఉండేవి. ఆరెంజ్ తోటలు అధికం. చలికాలంలో ఎక్కువ చలి ఉండదు. వేసవిలో మాత్రం వేడి ఎక్కువ. 1937లో జరిగిన స్పేనిష్ సివిల్ వార్లో ఇటలీ దీని మీద బాంబ్‌లు వేసింది. 1957లో తురియా నదికి వరదలు రావడంతో 81 మంది మరణించారు. చాలా ఆస్థి నష్టం కలిగింది. దాంతో ప్రభుత్వం 1964 - 1970 మధ్య తురియా నదిని మూడు కిలోమీటర్ల దూరం, పన్నెండు కిలోమీటర్ల పొడవు, 574 అడుగుల వెడల్పు మేర దారి మళ్ళించింది. ప్రస్తుతం టూరిజం, కన్‌స్ట్రక్షన్, ఆటోమొబైల్స్ ప్రధాన వనరులు.''

రోడ్లమీద సైకిళ్ళు చాలా కనిపించాయి. అన్ని యూరోపియన్ నగరాల్లో సైకిళ్ళ కోసం రోడ్లమీద 3-4 అడుగుల వెడల్పు మేర ప్రత్యేకంగా మార్గాన్ని కేటాయించడం చూసాను. రోడ్లకి అటు, ఇటు చెట్లు, లాన్స్‌తో చాలా పచ్చగా ఉంది.


ఆర్ట్స్ అండ్ సైన్స్ మ్యూజియం


మా కోచ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాంప్లెక్స్‌కి చేరుకుంది. బస్ బేలో కోచ్ ఆగాక గైడ్ చెప్పాడు.

''ఇది వేలన్షియా లోని అతి ప్రముఖ పర్యాటక కేంద్రం. ది సిటీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ యూరప్ లోని అతి పెద్ద సైంటిఫిక్, కల్చరల్ కాంప్లెక్స్‌లలో ఒకటి. సేంటియాగో కలత్రావా, ఫెలిక్స్ కెండెలా అనే ఇద్దరు అవాంత్ గార్డె ఆర్కిటెక్టర్‌తో ఈ సముదాయాన్ని డిజైన్ చేసారు. ఇక్కడ ఆరు పెద్ద భవంతులు ఉన్నాయి. అవి ఐమాక్స్ సినిమా థియేటర్, డిజిటల్ ఫిల్మ్స్, అమేకల్లో లేండ్ స్కేప్, కాన్స్టర్స్, అలాంటి ఇతర ఏక్టివిటీస్‌కి నిర్మించిన పెద్ద ఒపేరా, దాని పేరు రైనా సోఫియా పేలస్ ఆఫ్ ది ఆర్ట్స్, చివరగా అగోరా. ప్రిన్స్ పే ఫిలిపె సైన్స్ మ్యూజియంలో ఇంటరేక్టివ్ సైన్స్ సెంటర్, యూరప్‌లోని అతిపెద్ద అక్వేరియమైన ఓషనో గ్రాఫిక్ బిల్డింగ్ ఉన్నాయి. ఇందులో 500కి పైన జలచరాల జాతులున్నాయి. గతంలో దారి మళ్ళించక మునుపు తురియా నది పారిన ప్రదేశంలో రెండు కిలోమీటర్ల ఏరియాలో హెమీస్ ఫియరిక్ బిల్డింగ్‌ని పెద్ద కన్ను ఆకారంలో 'ఐ ఆఫ్ నాలెడ్జ్'గా నిర్మించారు. వీటన్నిటిలో కాన్ఫరెన్స్, ఎగ్జిబిషన్స్, ప్రొజెక్షన్స్, గైడెడ్ టూర్స్, సైన్స్‌కి చెందిన వర్క్‌షాప్స్, టెక్నాలజీ, నేచర్ అండ్ ఆర్ట్ మొదలైన ఎక్టివిటీలు అనేక రకాల అభిరుచులు గల

పర్యాటకులకి నిర్వహించబడుతున్నాయి. దీన్ని చూడడానికి ఒక రోజు సరిపోదు. కానీ మీ ట్రావెల్ ఏజెన్సీ కేవలం ఫోటో స్టాప్‌గా చేయడం నాకు చిత్రంగా ఉంది" పెడ్రో చెప్పాడు.

ఆ ఆవరణలో పెడ్రో వెంట నడిచాం. ఆ ఏరియా అంతా తిప్పి చూపించే రెండు పెట్టెలు గల మినీ రైల్ ఉంది. ఓషనో గ్రాఫిక్ బిల్డింగ్ ముందో విశాలమైన స్విమ్మింగ్ పూల్ ఉంది.

"దీన్ని జూలై 1996లో ఆరంభించి ఏప్రిల్ 1998లో పూర్తి చేసారు. 2009లో ఎల్ అగోరా బిల్డింగ్‌ని, 2015లో క్వీన్ సోఫియా పేలస్ ఆఫ్ ది ఆర్ట్స్‌ని ఆరంభించారు. భూమి ఉపరితలం మీద 14 అంతస్థులు, అండర్ గ్రౌండ్‌లో మూడు అంతస్థులగల క్వీన్ సోఫియా బిల్డింగ్ ఎత్తు 246 అడుగులు. ఇది ప్రపంచంలోని అతి ఎత్తైన ఒపేరా హౌస్. 4,31,000 చదరపు అడుగుల విస్తీర్ణం గల ఈ భవనంలో నాలుగు ఆడిటోరియాలు ఉన్నాయి. మెయిన్ హాల్ కెపాసిటీ 1470. ఇక్కడ నృత్యాలు, ఒపేరాలు జరుగుతాయి. దీని మీది ఆడిటోరియంలో 1420 సీటింగ్. మరో రెంటిలో ఒకోదాంట్లో 400 సీట్లు ఉన్నాయి" పెడ్రో చెప్పాడు.


సెరానోస్ టవర్

పదకొండుకి మళ్ళీ అంతా కోచ్ ఎక్కాం. అది అరగంట దూరంలోని టారస్ ది సెరానోస్ అంటే సెరానోస్ గేట్‌కి చేరుకుంది.

"ఇది వేలన్షియాలో ముఖ్యమైన లేండ్ మార్క్. నగర రక్షణకి కట్టిన ఇది నగరానికి ప్రధానద్వారం. నగరానికి వచ్చే రాయబారులు, రాజులకి ఇక్కడినించి స్వాగతం చెప్పేవారు. దీనికి సెరానోస్ టవర్ అనికూడా పేరు. చుట్టుపక్కల ట్రూయల్ అనే కొండప్రాంతం నించి వచ్చి వేలన్షియాలో స్థిరపడ్డవారి వల్ల ఈ పేరు వచ్చింది. సెరాన్స్ అంటే కొండప్రాంతపు మనుషులు అని అర్థం. 14వ శతాబ్దంలో ది క్రిష్టియన్ వాల్ అనే సిటీవాల్ ఈ నగరం చుట్టూ ఉండేది. అది దాటి నగరంలోకి రావడానికి పన్నెండు గేట్లు ఉండేవి. వాటిలో మిగిలున్న రెండు గేట్లలో ఇదొకటి.

"1586లో వేలన్షియాలోని జైలు తగలబడ్డాక దీన్ని జైలుగా మర్చారు. 1887లో ఇందులోని ఖైదీలని సెయింట్ ఆస్టిన్ మొనాస్ట్రీకి తరలించేదాకా ఇది జైలుగా ఉపయోగించింది. స్పానిష్ సివిల్ వార్ (1936 - 1939) సందర్భంలో ప్రాదో మ్యూజియంలోని విలువైన వస్తువులని ఇక్కడికి తరలించారు. దీని పైభాగం నించి పర్యాటకులు వేలన్షియాని చూడచ్చు. దీని ముందోద్వారం, వెనుకవైపు మొదటి అంతస్థులో మూడు, రెండో అంతస్థులో బురుజుల మీద రెండు ద్వారాలున్నాయి" పెడ్రో చెప్పాడు.



ఫోటోలు తీసుకుని కోచ్‌లో అక్కడనించి వేలన్షియా కెథడ్రిల్‌కి చేరుకున్నాం. ఈ కెథడ్రిల్ బయట ఓ పెద్ద ఫౌంటెన్ ఉంది. చుట్టూ ఉన్న చిన్న సరిహద్దు గోడ మీదున్న నగ్నంగా ఉన్న స్త్రీల చేతుల్లోని కుండల్లోంచి నీళ్ళు పడుతున్నాయి. ఫౌంటెన్ మధ్యలో ద్రాక్ష గుత్తితో కూర్చున్న పురుషుడి విగ్రహం ఉంది. ఇక్కడ పర్యాటకులు ఫోటోలు తీసుకుంటున్నారు. ఈ కెథడ్రిల్ పక్కనే చాలా అపార్ట్‌మెంట్స్ ఉన్నాయి. యూరప్ బాల్కనీలకి ప్రసిద్ధి. చుట్టుపక్కల ఇళ్ళల్లో అలాంటి బాల్కనీలు కొన్ని కనిపించాయి.

"స్థానికులు దీన్ని 'లా సియు కెథడ్రిల్' అని పిలుస్తారు. గతంలో ఇక్కడున్న మూర్స్ మసీదుగా మార్చారు. జేమ్స్ -1 ది కాంకరర్ 1238 వేలన్షియాని గెలుచుకుని తిరిగి దీన్ని కెథడ్రిల్‌గా మార్చి సెయింట్ మేరీకి అంకితం ఇచ్చాడు. ఇది అనేక శతాబ్దాల్లో రోమనెస్క్యూ ఫ్రెంచ్ గోథిక్, రినైసెన్స్, బరోక్, నియో క్లాసికల్ ఆర్కిటెక్చర్లతో నిర్మించబడింది. పోప్ అలెగ్జాండర్-6 ఈ చర్చ్‌లో కార్డినల్‌గా ఉన్నప్పుడు 15వ శతాబ్దపు స్థానిక, రోమ్‌లోని చిత్రకారుల చేత గీయించిన బొమ్మలు ఇందులో ఉన్నాయి. 1931లో స్పేనిష్ ప్రభుత్వం దీన్ని హిస్టారిక్, ఆర్టిస్టిక్ మాన్యుమెంట్‌గా ప్రకటించింది. స్పేనిష్ సివిల్ వార్లో ఇక్కడ మ్యూజికల్ ఆర్గాన్స్ కాలిపోయాయి. ఇక్కడి హోలీ ఛాలిస్ అనేకమంది పోప్స్ అధికారిక ఛాలిస్‌గా భావిస్తారు. లాస్ట్ సప్పర్‌లో జీసస్‌కి వైన్ సర్వ్ చేసిన పాత్రని హోలీ ఛాలిస్ అంటారు. 1874లో ఇక్కడి గోడలని శుభ్రపరిచినప్పుడు అనేక పెయింటింగ్స్ బయటపడ్డాయి."

గైడ్ పెడ్రో 176 అడుగుల వెడల్పు, 308 అడుగుల ఎత్తుగల గేటాఫ్ నిట్రాబ్ దగ్గరున్న ఒకప్పటి మాస్క్ కట్టడాలని చూపించాడు. ఐరన్ గేట్‌గా పిలవబడే దీని మెయిన్ డోర్‌ని 1703లో నిర్మించారు. ఐరన్ గేట్ చుట్టూ గోడల మీద క్రిస్టియన్ దూతల దేవతల అద్భుతమైన శిల్పాలని అమర్చారు.

అంతా కెథడ్రిల్ లోపలికి వెళ్ళి ఆ విశాలమైన చర్చ్‌ని చూసాం. మేం చూసిన అనేక చర్చ్‌ల్లానే ఉంది.

అక్కడ నించి 'టోరెస్ ది క్వార్ట్స్'కి వెళ్ళాము. ఇటలీ లోని నేపుల్ కేజిల్ టవర్స్‌ని పోలిన దీన్ని గోథిక్ మిలటరీ స్టైల్‌లో నిర్మించారు. స్పేనిష్ సివిల్ వార్లో ఇది కొంత దెబ్బతింది. 1441 - 1460ల మధ్య నిర్మించిన దీన్ని క్వార్ట్ టవర్ అని కూడా అంటారు. ఇది సిటీ వాల్‌లో నిలిచి ఉన్న పన్నెండు గేట్లలో ఒకటి. 'క్వార్ట్ ది పాబ్లెట్' అనే గ్రామ సమీపంలో ఉండటంతో దీనికీపేరు వచ్చింది. పశ్చిమంలోని కేస్టిల్ ప్రాంతం నించి వచ్చేవారు ఈ ద్వారం నించి నగర ప్రవేశం చేసేవారు. ఇది నాలుగు యుద్ధాలని చూసింది. 'ది వార్ ఆఫ్ సక్సెషన్, వార్ ఆఫ్ ఇండిపెండెన్స్, కేంటొనల్ రివల్యూషన్, చివరగా స్పేనిష్ సివిల్ వార్. గోడలకి ఫిరంగి గుళ్ళు చేసిన రంధ్రాలు పావురాల గూళ్ళుగా ఉపయోగిస్తున్నాయి. 1626 నించి 18వ శతాబ్దం దాకా దీన్ని ఆడవారి జైలుగా ఉపయోగించేవారు.

రెండు టవర్స్ మధ్య గల తలుపులోంచి లోపలకి వెళ్ళాము. అది చూసి బయటకి వచ్చాక పెడ్రో మాకు గుడ్‌బై చెప్పి వెళ్ళిపోయాడు. నేను అతనికి ఐదు యూరోలు టిప్‌గా ఇస్తే అది చూసిన దీపక్‌తో అతను నవ్వుతూ, 'ఈ రాత్రి వైన్ మనీ ఇది' అని చెప్పాడు. అంతా కోచ్ ఎక్కాక దీపక్ చెప్పాడు.

"350 కిలోమీటర్ల దూరంలోని మన ఆఖరి డెస్టినేషన్ బార్సిలోనాకి బయలుదేరుతున్నాం. సుమారు 4 గంటల ప్రయాణం. ఈ రోజు మనకి లంచ్ మిస్సయింది."




మా కోచ్ మూడు గంటలకి వేలన్షియా నించి బయలుదేరి, నాలుగున్నరకి మెడాస్ అనే రెస్టరెంట్ ఆవరణలో ఆగింది. 24 గంటల కాఫీ సర్వీస్, రూం తీసుకోకుండా స్నానం చేసే షవర్స్ ఉన్నాయి. ఫ్రెంచ్ ఫ్రైస్ తిని కాఫీ తాగాం.

మా కోచ్ బార్సిలోనాలోకి ప్రవేశిస్తుండగా దీపక్ చెప్పాడు.

"మనం ముందు డిన్నర్‌కి రెస్టరెంట్‌కి వెళ్ళి తర్వాత హోటల్లో చెకిన్ అవుతాం."

మా కోచ్ శాంతి అనే ఇండియన్ రెస్టరెంట్ బయట రాత్రి ఎనిమిదికి ఆగింది. దాని బయట బోర్డ్ మీద నాలుగు భాషల్లో, శాంతి పౌ (కేటలాన్) పజ్ (హిబ్రూ) పీస్ అనే అక్షరాలు, ఆ బోర్డ్ చుట్టూ నాలుగు మూలల్లో నాలుగు తెల్లపావురాలు ఉన్నాయి.

ఎప్పటిలా నార్త్ ఇండియన్ భోజనమే. తొమ్మిదిన్నరకి మళ్ళీ కోచ్ ఎక్కాం.
"రేపటి మీ అన్ లక్కీ నంబర్లు 7-8-9" దారిలో దీపక్ చెప్పాడు.
అక్కడనించి హోటల్ ఆబా గార్డెన్స్‌కి వెళ్ళాం. మా రూం నంబర్ 307. అలసిపోవడంతో వెంటనే నిద్రపోయాం.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in
***ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి***